

'ఆయుష్' పెంచుతున్నారు..

పంచకర్మ వైద్యంతో వ్యాధులకు చెక్ పెడుతున్నారు. కోటబొమ్మాళి ఆయుర్వేద వైద్యశాలలో మెరుగైన సేవలు అందిస్తున్నారు. - 8లో



జగనన్నే శాశ్వత ముఖ్యమంత్రి

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శాశ్వత ముఖ్యమంత్రిగా అయ్యేందుకు గృహసారథులు కంకణం కట్టుకోవాలని మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. - 8లో

18న జిల్లా స్థాయి నృత్య పోటీలు

వజ్రపుకొత్తూరు రూరల్: మహా శివరాత్రి సందర్భంగా గుల్లలపాడులో ఈ నెల 18న జిల్లా స్థాయి నృత్య పోటీలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. వివరాలకు 9491929589, 9849937659 నంబర్లను సంప్రదించాలని కోరారు.

న్యూస్‌రీల్

ఆదిత్యాలయానికి వెండి శంఖువు బహూకరణ



ఈఓకు వెండి శంఖువు అందజేస్తున్న వెంకటస్వామి

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి సామాజికవేత్త మంత్రి వెంకటస్వామి గురువారం దక్షిణావృత వెండి శంఖువు, కూర్మాన్ని కానుకగా అందజేశారు. ఈ మేరకు గురువారం ఆలయ ఈవో వి.హరిసూర్యప్రకాష్‌కు కలిసి వీటిని ఆలయ ఉత్సవాల సమయాల్లో వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, నేతేటి హరిప్రసాద్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

మార్చి 6 నుంచి శ్రీకూర్మం డోలోయాత్ర



మాట్లాడుతున్న దేవదాయ శాఖ ఏసీ హరిసూర్యప్రకాశరావు

గార: శ్రీకూర్మంలోని కూర్మనాథ ఆలయంలో ప్రధాన ఉత్సవమైన డోలోయాత్రకు ఏర్పాట్లు పక్కాగా ఉండాలని దేవదాయ శాఖ ఏసీ హరిసూర్యప్రకాశరావు అన్నారు. గురువారం కూర్మనాథాలయంలో అధికారులు, పాలకమండలి సభ్యులు, అర్చకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 6 నుంచి మూడు రోజుల పాటు యాత్ర జరుగుతుందన్నారు. యాత్ర అనంతరం కుంభాభిషేకం నిర్వహించేందుకు ముహూర్తం నిర్ణయించాలన్నారు. కార్యక్రమంలో ఈఓ గుత్తు గురునాథం, ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు, పాలక మండలి సభ్యులు అనుపోజు నాగరాజు, పొన్నాడ రుషి, బోర కృష్ణవేణి, శ్యామలారావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐ ఉద్యోగాల రాతపరీక్షకు ఏర్పాట్లు



శ్రీచైతన్య టెక్నో స్కూలు పరీక్ష కేంద్రం వద్ద అధికారులకు సూచనలిస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్/ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలో ఈ నెల 19న జరగనున్న ఎస్‌ఐ ఉద్యోగాల ప్రిలిమినరీ రాత పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఎస్పీ రాధిక పోలీసు అధికారులకు, పరీక్ష కేంద్రాల యాజమాన్యాలకు ఆదేశాలు జారీ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని శ్రీ చైతన్య టెక్నో పాఠశాల, చిలకపాలెంలోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కళాశాల పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరీక్ష రెండు పూటలు ఉంటుందన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మళ్లీ మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. పరీక్షా కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతరం నిఘా ఏర్పాటుచేయాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ మహేంద్ర, ఒకటో పట్టణ సీఐ సన్యాసినాయుడు, ఎస్‌ఐలు విజయ్‌కుమార్, గణేష్ పాల్గొన్నారు.

పాలిసెట్ నోటిఫికేషన్ విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో డిప్లమో కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు జిల్లా ప్రవేశాల అధికారి, శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జి.దామోదర్‌రావు గురువారం చెప్పారు. శ్రీకాకుళం ప్రాంతం పరిధిలో ఐదు ప్రభుత్వ, ఐదు ప్రైవేట్ కళాశాలలు ఉన్నాయని తెలిపారు. 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని, ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో సహాయ కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. బీసీ, ఓసీలకు రూ.400, ఎస్సీ ఎస్టీలకు రూ.100 దరఖాస్తు రుసుముగా నిర్ణయించినట్లు చెప్పారు. ఏప్రిల్ 31లోగా దరఖాస్తు చేసుకోవాలని, మే 10న ప్రవేశ పరీక్ష ఉంటుందని చెప్పారు. పూర్తి వివరాలకు సాంకేతిక విద్యాశాఖ వెబ్‌సైట్, ప్రభుత్వ కళాశాలల్లోని సహాయ కేంద్రంలో సంప్రదించాలని సూచించారు.

ఉత్సవ వైభవం

శ్రీమన్నారాయణుడు భక్తుల వద్దకే వచ్చి పూజలందుకున్నాడు. దేవేరులతో కలిసి తిరువీధుల్లో విహరించాడు. భక్తులు తన్మయత్వంతో వెంటరాగా మంజూష(మందస) పురవీధుల్లో గురువారం ఊరేగాడు. అనంతరం భక్తజన సందోహం మధ్య గోపాలసాగరంలో స్వామి చక్రతీర్థం, అవభృథస్నానం కనులపండువగా సాగింది. జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. – మందస





గోపాలసాగరంలో వాసుదేవునికి అవభృథస్నానం చేయిస్తున్న వేదపండితులు (ఇన్‌సెట్లో) అలంకృతుడైన వాసుదేవస్వామి

ఉద్యోగాలకు దారి చూపిన స్కిల్

వారంతా టెన్త్, ఇంటర్, ఐటీఐ వంటి తక్కువ అర్హతలు ఉన్నవారే. ఏదో ఒక పని చేస్తే తప్ప కుటుంబానికి అండ లభించని పరిస్థితి. కానీ తక్కువ చదువుకు ఉద్యోగం దొరుకుతుందో లేదోనన్న ఆందోళన. కానీ ఆ ఆందోళనలకు తెరదించి.. వారిలోని స్కిల్‌కు సానబట్టి ఉద్యోగావకాశాలు కల్పించింది ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్. ఈ సంస్థకు చెందిన ఎచ్చెర్ల కేంద్రంలో శిక్షణ పొందిన మొదటి బ్యాచ్ సభ్యులందరికీ ప్లేస్‌మెంట్ చూపించి.. అభ్యర్థుల భవిష్యత్తుకు బాటలు వేయడం విశేషం.



- సత్ఫలితాలిస్తున్న ఎచ్చెర్ల స్కిల్ హబ్
- మొదటి బ్యాచ్ అందరికీ ఉద్యోగాలు

ఎచ్చెర్ల క్యాంపస్: పారిశ్రామిక అవసరాలకు తగ్గట్లు నైపుణ్యం పెరిగేలా శిక్షణ ఇచ్చి, ఉద్యోగాలు కల్పించేందుకు ఏర్పాటు చేసిన స్కిల్ హబ్‌లు సత్ఫలితాలిస్తున్నాయి. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జిల్లాలోని మొదటి స్కిల్ హబ్ ఎచ్చెర్ల ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రం(ప్రభుత్వ ఐటీఐ)లో ప్రారంభించారు. ఇక్కడ మొదటి బ్యాచ్‌లో బాలురుకు ఫిట్టర్ ఫ్యాబ్రికేషన్‌లో నాలుగు నెలల పాటు శిక్షణ ఇచ్చారు. అక్టోబర్ 26 నుంచి జనవరి 31 వరకు శిక్షణ పొందిన 30 మందికీ ఉద్యోగాలు కల్పించారు.

నైపుణ్యాల పెంపే లక్ష్యం..

ఇక్కడి యువతకు పరిశ్రమలకు అవసరమైన పూర్తి స్థాయి నైపుణ్యాలపై శిక్షణ ఇచ్చారు. మొత్తం 30 మందిలో 26 మందికి కడప జిల్లాలోని షిర్డీసాయి ఎలక్ట్రికల్స్‌లో ఉద్యోగాలు కల్పించారు. నెలకు రూ.12 వేలు వేతనం, వసతి, భోజన సౌకర్యం కల్పించనున్నారు. కంపెనీ నిబంధనల మేరకు తర్వాత వేతనాలు పెంచుతారు. మిగతా నలుగురికి హైదరాబాద్‌లోని మేధా పరిశ్రమలో ఉద్యోగాలు కల్పించారు. వీరికి నెలకు రూ.13500 వేతనం చెల్లిస్తారు. ఇలా మొదటి బ్యాచ్ శిక్షణ, ఉద్యోగాలు కల్పన విజయవంతంగా పూర్తిచేశారు. ప్రస్తుతం రెండో బ్యాచ్‌గా డేటా ఎంట్రీ ఆపరేటర్ శిక్షణ జనవరి 4న ప్రారంభమైంది. ఏప్రిల్ 29 వరకు శిక్షణ కొనసాగుతుంది. ఇక్కడ ఐటీఐ, ఇంటర్మీడియట్, 10వ తరగతి అర్హత కలిగిన యువతకు శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు. మరోవైపు స్థానిక పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగాలు యువతకు లభించాలన్నా నైపుణ్యాలు కీలకం. అందుకే 18 నుంచి 27 ఏళ్ల యువతకు పూర్తిస్థాయిలో నైపుణ్యాలు పెంపొందించే లక్ష్యంగా శిక్షణ సాగుతోంది.



ప్రయోగ శిక్షణలో యువకులు

ప్రయోజనకరం..



ఐటీఐ పూర్తిచేశాను. స్కిల్ హబ్‌లో చేరాను. నాలుగు నెలల పాటు ఫిట్టర్ ఫ్యాబ్రికేషన్స్ శిక్షణ పొందాను. అనంతరం ఉద్యోగం కల్పించారు. స్కిల్ హబ్‌లు యువతకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటున్నాయి.

– పంచిరెడ్డి లీలా ప్రకాష్, సంతబొమ్మాళి

ఆనందంగా ఉంది



అనేక పరిశ్రమల్లో ఉద్యోగాల కోసం ప్రయత్నించాను. అయినా సాధ్యం కాలేదు. దీంతో స్కిల్ హబ్ మొదటి బ్యాచ్‌లో చేరి శిక్షణ పొందాను. ఇప్పుడు ఉద్యోగం లభించింది. పరిశ్రమలకు అవసరమైన శిక్షణ, జీవితంలో ఉన్నత స్థాయికి చేరేందుకు అవసరమైన నైపుణ్యాలు, మెలకువలు తెలుసుకున్నాను.

– కొల్లి ఏసయ్య, చినకొంగరాం, ఎచ్చెర్ల మండలం

యువతకు ఉపాధి



గ్రామీణ ప్రాంత యువతకు నైపుణ్య కల్పన, స్వయం ఉపాధి, ఉద్యోగాలు కల్పించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కృషిచేస్తోంది. ప్రతిఒక్కరూ శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి.

– పి.బి.సాయిశ్రీనివాస్, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి

నైపుణ్యాలు కీలకం



ఐటీఐ, పాలిటెక్నిక్, ఇతర సాంకేతిక విద్య, పారిశ్రామిక విద్య పూర్తిచేసిన విద్యార్థులు నైపుణ్యాలు లేక ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందలేకపోతున్నారు. పరిశ్రమలు సైతం స్కిల్డ్ వర్కర్స్‌కే ప్రాధాన్యమిస్తున్నాయి. శిక్షణ వినియోగించుకోవాలి.

– శ్రీనివాసరావు, ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్

వంశధార పేపర్ మిల్లులో అగ్ని ప్రమాదం

- విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో వంద టన్నుల పేపర్ దగ్ధం
- రూ.30 లక్షలపైనే ఆస్తి నష్టం

నరసన్నపేట: మడపాం వంశధార పేపరు మిల్లులో గురువారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో రూ.30 లక్షలపైనే ఆస్తి నష్టం ఉంటుందని ప్రాథమికంగా అంచనా వేశారు. రాత్రి 7.30 సమయంలో ప్రొపిల్ పాయింట్, రివైండర్ వద్ద మంటలు చెలరేగాయి. ఇక్కడ విధుల్లో ఉన్న రివైండ్ ఆపరేటర్ రామకృష్ణ, అసిస్టెంట్ ఆపరేటర్ సూర్యనారాయణ, మిషన్ ఆపరేటర్ రాజేష్, శ్రీను తదితరులు ప్రమాదం గుర్తించి మిల్లు యజమానులకు సమాచారం అందించారు. మిల్లు వైస్‌ప్రెసిడెంట్ గుప్తా సిబ్బందిని పంపించి మంటలను ఆర్పే ప్రయత్నాలు చేశారు. అయినా అదుపులోకి రాకపోవడంతో నరసన్నపేట, శ్రీకాకుళం అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. జిల్లా అగ్నిమాపక అధికారి వీరభద్రరావు, అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ వరప్రసాద్‌తో పాటు 15 మంది సిబ్బంది తీవ్రంగా శ్రమించి రాత్రి 9 గంటలకల్లా మంటలను అదుపులోనికి తీసుకువచ్చారు. సిబ్బందికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో యాజమాన్యం ఊపిరి పీల్చుకుంది. అమ్మకానికి సిద్ధంగా ఉన్న 30 టన్నుల పేపరుతో పాటు తయారైన మరో 70 టన్నుల పేపర్ దగ్ధమైంది. రివైండర్ ప్రొపిల్ పాయింట్ మిషన్లను ఆనుకొని ఉన్న యంత్రాలు కాలిపోయాయి. అగ్ని మాపక సిబ్బంది అప్రమత్తమై స్పందించడంతో ప్రమాద తీవ్రత తగ్గిందని, శుక్రవారం ఉదయానికి పూర్తి నష్టం తెలుస్తుందని మిల్లు ఎండీ రాజేంద్రన్, వైస్ ప్రెసిడెంట్ గుప్తా తెలిపారు.



ప్రమాద తీవ్రతను అంచనా వేస్తున్న జిల్లా అగ్నిమాపక అధికారి



కాలిపోతున్న పేపరు బండిల్స్

ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ జారీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: శ్రీకాకుళం స్థానిక సంస్థల నుంచి ఆంధ్రప్రదేశ్ శాసనమండలి (ఎమ్మెల్సీ) ఎన్నికకు సంబంధించి ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్, స్థానిక సంస్థల శ్రీకాకుళం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి బి.నవ్య గురువారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ నెల 16 నుంచి 23(సెలవు దినాలు మినహాయించి)లోగా నామినేషన్ పత్రాలను అభ్యర్థి/ప్రతిపాదకులు కలెక్టర్ కార్యాలయంలోని రిటర్నింగ్ అధికారికి గానీ, సహాయ రిటర్నింగ్ అధికారికి గానీ దాఖలు చేయాలని సూచించారు. ఈ నెల 24న నామినేషన్ పత్రాల పరిశీలన, 27న ఉపసంహరణ ఉంటుందని తెలిపారు. మార్చి 13న పోలింగ్ జరుగుతుందని ఆమె తెలిపారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీకి తొలిరోజు ఒక నామినేషన్



విశాఖ కలెక్టర్‌కు నామినేషన్ ప్రతాలు అందజేస్తున్న స్వతంత్ర అభ్యర్థి రమాప్రభ

మహారాణిపేట: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పీడీఎఫ్ మద్దతుతో స్వతంత్ర అభ్యర్థిగా కోరెడ్ల రమాప్రభ నామినేషన్ దాఖలు చేశారు. విశాఖ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం తన నామినేషన్ పత్రాలను(రెండు సెట్లు) ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ డా.ఎ.మల్లికార్జునకు అందజేశారు. అంతకుముందు ఆమె డాబాగార్డెన్స్‌లోని అంబేడ్కర్ విగ్రహం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా తరలివచ్చారు. ఎమ్మెల్సీలు ఐ.వెంకటేశ్వర్లు, లక్ష్మణరావు, మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బి.వెంకటేశ్వర్లు, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ తదితరులు పాల్గొన్నారు.

శివం.. సుందరం



మహాశివరాత్రికి శైవక్షేత్రాలు సిద్ధమవుతున్నాయి. జిల్లాలో ప్రముఖ శివాలయాలైన శ్రీముఖలింగం, రావివలస ఎండల మల్లికార్జునస్వామి, శ్రీకాకుళంలోని ఉమారుద్రకోటేశ్వర స్వామి తదితర ఆలయాల్లో పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు. వేలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున పోలీసులు పటిష్ట బందోబస్తుతో సిద్ధమౌతున్నారు.

- శివరాత్రికి సుందరంగా ముస్తాబైన శివాలయాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు
- పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్న పోలీసులు

ముక్తికి మార్గం.. శ్రీముఖలింగం

జలుమూరు: ప్రసిద్ధ శైవ క్షేత్రం శ్రీముఖలింగం దక్షిణ కాశీగా పేరొందింది. ఎక్కడైనా శివుడు లింగాకారంలో ఉంటాడు. ఇక్కడ మాత్రం ముఖం దాల్చి ఆవిర్భవించాడు. అందుకే ఈ క్షేత్రానికి శ్రీముఖలింగమని, ఇక్కడ కొలువైన శివుడిని ముఖలింగేశ్వరుడని పిలుస్తారు. కాశీలో లింగం, గంగలో స్నానం, శ్రీశైలంలో శిఖరం, శ్రీముఖలింగంలో ముఖదర్శనం చేసుకుంటే మోక్షం సిద్ధిస్తుందని పురాణాలు చెబుతున్నాయి. గత ఏడాది మాదిరిగానే ఈసారి కూడా ఫిబ్రవరి 18 నుంచి 20 వరకు మూడు రోజుల పాటు శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈఓ పి.ప్రభాకరరావు తెలిపారు.

ఎన్నెన్నో ప్రాముఖ్యతలు..

శ్రీముఖలింగంలో మూడు ప్రధాన ఆలయాలతోపాటు అనేక శివలింగాలు ఉన్నాయి. కోటికి ఒక్కటి తక్కువగా ఉండడం వల్ల కాశీగా పేరొందాల్సిన శ్రీముఖలింగం దక్షిణ కాశీగా మిగిలిపోయిందని అర్చకులు చెబుతున్నారు.



పూజలు అందుకుంటున్న స్వామివారి స్వయంభూ లింగం



ఆలయానికి చేరుకునే మార్గాలు..

- శివరాత్రి ఉత్సవాల నేపథ్యంలో శ్రీకాకుళం నుంచి ప్రతి అరగంటకు బస్సు సౌకర్యం ఉంది.
- ప్రస్తుతం ఎనిమిది బస్సు సర్వీసులు నడుపుతున్నారు. భక్తులు అవసరం దృష్ట్యా అదనపు సర్వీసులు వేస్తారు.
- ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చే అవకాశమున్నందున ఐదు వందల మందికి పైగా పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు సీఐ డి.రాము తెలిపారు.
- ఉత్సవాల ఆఖరి రోజు సోమవారం త్రిశూల్ చక్రతీర్థ స్నానాలకు 6 నుంచి 7 వరకూ రోప్ పార్టీలను వినియోగించనున్నట్లు చెప్పారు.

కలియుగ కైలాసం.. ఎండల మల్లన్న క్షేత్రం



టెక్కలి: మండలంలోని రావివలస ఎండల మల్లికార్జునస్వామి ఆలయం కలియుగ కైలాసంగా పేరుగాంచింది. శనివారం మహా శివరాత్రి సందర్భంగా క్షేత్రం ప్రత్యేక పూజలకు సిద్ధమైంది. మంగళవారం వరకు జరిగే ఉత్సవాల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఈఓ వి.వి.సూర్యనారాయణ, సర్పంచ్ సర్లాన బాలకృష్ణ, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ సర్లాన సుధాకర్ తెలిపారు. శనివారం మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తారు. రాత్రి 12 గంటల సమయంలో లింగోద్భవం నిర్వహిస్తారు. అదే రోజు రాత్రి పలు సాంఘిక నాటకాలు, నృత్యప్రదర్శనలు నిర్వహిస్తారు. ఆదివారం నిత్య అర్చనలు, అభిషేకాలతో పాటు మల్లన్నకు విభూదితో అభిషేకం చేస్తారు. సోమవారం నిత్య అర్చనలు, అభిషేకాలు నిర్వహిస్తారు.

- మంగళవారం ఉదయం 9 గంటలకు భ్రమరాంబ సమేత మల్లన్నకు తిరువీధి ఉత్సవం, సీత కోనేరులో చక్రతీర్థ స్నానాలు నిర్వహిస్తారు.

ఇదీ స్థలపురాణం..

- ద్వాపరయుగంలో అర్జునుడు శివుని కటాక్షం కోసం కఠోర తపస్సు చేస్తాడు. శివుడు ప్రత్యక్షం కావడంతో నీ నామం తర్వాత నా పేరు ఉండాలని అని కోరగా 'మల్లికార్జునుడు' అనే నామం కొనసాగింది. కాలానుగుణంగా ఈ లింగం ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తుండడంతో ఈ యుగం నాటికి 'ఎండల మల్లికార్జునుడు'గా స్థిరపడింది. అప్పటి నుంచి ఎండల మల్లికార్జునుడు వెలసిన ప్రాంతం కలియుగ కైలాసంగా పేరుగాంచింది.



మీరు వెళ్లాలంటే..

- టెక్కలి మండలం రావివలసలోని ఎండల మల్లికార్జున స్వామి ఆలయానికి చేరుకునేందుకు రోడ్డు, రైల్వే మార్గాలు ఉన్నాయి.
- జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం నుంచి టెక్కలి చేరుకుని అక్కడి నుంచి 4 కిలోమీటర్ల దూరంలో ఈ ఆలయానికి చేరుకునేందుకు అనేక బస్సులు, ఆటోలు అందుబాటులో ఉంటాయి.
- సుమారు 5 కిలోమీటర్ల దూరంలో నౌపడ రైల్వే స్టేషన్, 20 కిలోమీటర్ల దూరంలో పలాస రైల్వే స్టేషన్‌కు రైల్వే మార్గంలో చేరుకుని అక్కడి నుంచి బస్సులు, చిన్నపాటి వాహనాల్లో ఆలయానికి చేరుకోవచ్చు.

ద్వాపరయుగం నాటి క్షేత్రం.. ఉమారుద్రుని ఆలయం

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం నగరంలోని నాగావళి తీరంలో గుడివీధిలో ఉన్న ఉమా రుద్ర కోటేశ్వరాలయం అత్యంత పురాతనమైనది. ద్వాపర యుగాంతంలో బలరాముడు ప్రతిష్ఠించాడని పురాణాలు చెబుతున్నాయి. ఈ ప్రాంతాన్ని గతంలో రుద్రకోటేశ్వర అగ్రహారం అనేవారు. బలరామ ప్రతిష్ఠితాలైన పంచలింగాల ప్రాంతం కావడంతో పంచలింగ క్షేత్రంగా ప్రసిద్ధి చెందినది. శివరాత్రి నాడే శనిత్రయోదశి కూడా కావడంతో భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్ సిద్ధం చేశామని ఆలయ అర్చకులు శ్రీరామమూర్తి తెలిపారు. ఉచిత దర్శనంతో పాటు రూ.20, రూ.50 శీఘ్రదర్శనాల క్యూలైన్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. భక్తులు ఎండబారిన పడకుండా షామియానాలు సిద్ధం చేశామన్నారు. శనివారం రాత్రి 12గంటలకు లింగోద్భవ పూజలు జరుగుతాయని, తెల్లవారి 3గంటలకు నందివాహనంపై స్వామివారి ఊరేగింపు ఉంటుందని తెలిపారు.

నదీస్నానాలకు ఏర్పాట్లు..

నాగావళి నదిలో స్నానాలు చేసేందుకు రివర్ వ్యూపార్కు నుంచి ప్రత్యేక గేటు ఏర్పాటు చేశారు. గతంలో ఉన్న గేటు మూసి వేశారు. మున్సిపల్ అధికారుల సహకారంతో తీరం పరిశుభ్రం చేస్తున్నారు. తెల్లవారు జామున వచ్చే భక్తుల కోసం లైట్లు ఏర్పాటు చేస్తున్నారు. వేకువ జాము 3గంటల నుంచి ప్రత్యేక పూజలు, భక్తుల రద్దీబట్టి రుద్రాభిషేకాలు చేయిస్తారు.



ఉమారుద్రకోటేశ్వరుడు

క్లుప్తంగా

ఘనంగా ఆదిత్యుని కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

అరసవల్లి: ఉషా పద్మిని ఛాయాదేవి అమ్మవార్లతో సూర్యనారాయణస్వామి వారి కల్యాణోత్సవం గురువారం స్థానిక అనివెట్టి మండపంలో ఘనంగా జరిగింది. మాఘ బహుళ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆగమశాస్త్రం ప్రకారం కల్యాణ ప్రక్రియను ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. వెండి సింహ వాహనంలో వేంచేంపజేసిన కల్యాణమూర్తుల కల్యాణ సేవలో పలువురు భక్తులు రూ.500 చెల్లించి పాల్గొన్నారు. వీరికి స్వామి వారి శేషవస్త్రాలతో పాటు కల్యాణ తలంబ్రాలను అర్చకులు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో వి.హరిసూర్యప్రకాష్, అర్చకులు ఇప్పిలి సాందీప్ శర్మలు పాల్గొన్నారు.

శ్రీశైల మల్లన్న తలపాగా ఊరేగింపు



తలపాగాను ఊరేగిస్తున్న చేనేత కార్మికులు

ఆమదాలవలస రూరల్: శ్రీనివాసాచార్యులపేట గ్రామంలో శ్రీశైలం మల్లికార్జునస్వామి కోసం చేనేత మగ్గంపై నేసిన తలపాగాను గురువారం ఊరేగించారు. గ్రామానికి చెందిన చేనేత సంఘం ఆధ్వర్యంలో శివరాత్రి రోజున మల్లన్నకు సమర్పించడం కోసం 180 మీటర్ల తలపాగాను మగ్గంపై నేశారు. గ్రామస్తుల కోరిక మేరకు పురవీధుల్లో తలపాగాను మేళతాళాల మధ్య ఊరేగించగా మహిళలు పూజలు చేశారు. అనంతరం తలపాగాను శ్రీశైలం తీసుకువెళ్లేందుకు చేనేత కార్మికులుపయనమయ్యారు.

గ్రానైట్ ఎక్స్‌పోలో ఉత్తరాంధ్ర ప్రతినిధులు



హాజరైన అసోసియేషన్ ప్రతినిధులు

టెక్కలి: బెంగళూరులో ఇటీవల నిర్వహించిన గ్రానైట్ ఎక్స్‌పో (గ్రానైట్ ఉత్పత్తులు, మెషినరీ) ప్రదర్శనకు ఉత్తరాంధ్ర గ్రానైట్ అసోసియేషన్ ప్రతినిధులు హాజరయ్యారు. ఎగ్జిబిషన్‌లో ప్రపంచ వ్యాప్తంగా వివిధ రకాల గ్రానైట్ ఉత్పత్తులు, మెషినరీలు, గ్రానైట్ వ్యాపారానికి అవసరమైన టెక్నాలజీను ప్రదర్శించినట్టు ప్రతినిధులు తెలిపారు. ఉత్తరాంధ్ర గ్రానైట్ అసోసియేషన్ నుంచి సుంకరి కృష్ణ, చింతాడ గణపతి, కోత మురళీధర్, వరుదు దేవిప్రసాద్, కూన రవికుమార్, కె.హరి, ఎ.నగేష్, వి.వి.రాజు, రామారావు, ధవళ రాజేంద్ర హాజరయ్యారు.

గడ్డికుప్పలు దగ్ధం



కాలిపోయిన గడ్డి కుప్పలు

మెళియాపుట్టి: అగ్ని ప్రమాదంలో ఐదెకరాల్లో సాగు చేసిన వరిగడ్డి కాలిపోయింది. ఈ సంఘటన నందవ కొత్తూరు గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. రైతు అనంతగిరి అప్పారావు ఐదు ఎకరాల్లో సాగు చేసిన వరి పంటను నూర్పు చేసి పశువుల దాణాకోసం గడ్డిని కుప్పగా వేసి ఉంచుకున్నారు. అగ్ని ప్రమాదంలో గడ్డి దగ్ధం కావడంతో రైతు కన్నీరుమున్నీరయ్యారు. గ్రామస్తులు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేసేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. అప్పటికే మంటలు ఎగసి పడటంతో గడ్డి కుప్ప పూర్తిగా కాలిపోయిందని స్థానికులు తెలిపారు. ప్రమాదానికి కారణం తెలియరాలేదు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	54,930–00
బంగారం(22సి. 10గ్రా.)	50,350–00
వెండి (కిలో)	74,500–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 551.00
శ్రీకాకుళం	రూ. 551.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹105	₹165	₹ 185

ఆయుష్ పెంచుతున్నారు..

- పంచకర్మ వైద్యంతో పలు వ్యాధులకు చెక్
- కోటబొమ్మాళి ఆయుర్వేద వైద్యశాలలో మెరుగైన సేవలు

కోటబొమ్మాళి: వైద్య రంగానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోంది. ఇందులో భాగంగా జనరల్ ఆస్పత్రులతోపాటు ఆయుర్వేద వైద్యశాలల్లో కూడా మెరుగైన సౌకర్యాలను కల్పిస్తోంది. సర్కార్ తీసుకుంటున్న చర్యలతో ఆయుర్వేద వైద్యానికి రోగుల నుంచి విశేష స్పందన వస్తోంది. జిల్లాలోని కోటబొమ్మాళి లో ప్రభుత్వాస్పత్రి ఆవరణలో 2021 అగస్టు నెలలో ప్రారంభించిన ఆయుష్ ఆయుర్వేదిక్ ఆస్పత్రి ద్వారా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. ఇక్కడ ఒక మెడికల్ ఆఫీసర్, ముగ్గురు సిబ్బందితోపాటు యోగా శిక్షణకు ఇద్దరు టీచర్లు ఉన్నారు. ఆస్పత్రి ప్రారంభం నుంచి పలు రోగాలకు మెరుగైన వైద్య సేవలు అందుతుండటంతో రోజురోజుకూ ఇక్కడికి వచ్చే రోగుల సంఖ్య పెరుగుతోంది. రోజు కు 20 మందికి పైగా రోగులు వచ్చి వైద్యం పొందుతున్నారు. రోగుల అవసరానికి తగ్గట్టుగా మందుల ను ప్రభుత్వం సరఫరా చేస్తోంది. ఆయుర్వేద వైద్యంతోపాటు యోగాసనాలు వంటి చికిత్సలతో పక్షవాతం, కీళ్లవాతం, నరాల సమస్య, వెన్నెముక నొప్పి, మానసిక వ్యాధి, గ్యాస్టిక్ సమస్యలు నయమవుతున్నాయని రోగులు చెబుతున్నారు. ఉదయం తొమ్మి ది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ ఇక్కడ వైద్య సేవలు అందుతాయి. ఆదివారం, పబ్లిక్ సెలవు దినాల్లో ఆస్పత్రిని తెరవరు.

ప్రత్యేక చికిత్సగా పంచకర్మ

జిల్లాలో పంచకర్మ చికిత్స కోటబొమ్మాళిలోని ఆయుష్ ఆస్పత్రిలోనే అందుబాటులో ఉంది. ఆయుర్వేదిక్-పంచకర్మ చికిత్సా విధానంలో పూర్వకర్మ, ప్రధానకర్మ, పశ్చత్‌కర్మ, అగ్నికర్మలు ఉండగా.. ఈ విధానాలతో సందివాతం, పక్షవాతం, కీళ్లవాతం, నరాల సమస్య, వెన్నెముక నొప్పి, మానసిక వ్యాధి, గ్యాస్ట్రిక్ వ్యాధులను నయం చేస్తున్నారు. చికిత్స పొందుతున్నవారు పది రోజుల్లోనే పూర్తిగా కోలుకుంటున్నారు. ఒడిశాతో పాటు జిల్లా నలుమూలల నుంచి రోగులు ఈ ఆస్పత్రిని ఆశ్రయిస్తున్నారు.



పంచకర్మ విధానంలో చికిత్స చేస్తున్న దృశ్యం

మెరుగైన సేవలు



కోటబొమ్మాళిలో ఆయిర్వేద ఆస్పత్రి ఏర్పాటు చేయడం మంచి పరిణామం. నరాల సమస్య కోసం చికిత్స తీసుకొని పది రోజుల్లోనే కోలుకున్నాను. ఇక్కడ మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి.

–ఎస్.వెంకటరమణ, చవితిపేట, కోటబొమ్మాళి మండలం

చికిత్సల్లో ముందున్నాం



జిల్లాలోనే పంచకర్మ విధానంలో చికిత్స కోటబొమ్మాళి ఆయుష్ ఆస్పత్రిలో మాత్రమే ఉంది. ఈ విధానంలో వ్యాధి తీవ్రతను బట్టి చికిత్స చేస్తున్నాం. ఆయుర్వేద వైద్యంలో జిల్లాలోనే ప్రథమ స్థానంలో ఉన్నాం. రానున్న రోజుల్లో మరిన్ని సేవలు అందిస్తాం.

–డాక్టర్ కె.వివేకానంద, ఆయుర్వేదిక్ ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్, కోటబొమ్మాళి

వారం రోజుల్లో కోలుకున్నా..



ఆయుష్ ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. కీళ్లవాతంతో బాధపడిన నేను ఇక్కడ వైద్య తీసుకొని వారం రోజుల్లోనే కోలుకున్నాను. సిబ్బంది మెరుగైన సేవలు అందిస్తున్నారు.

–నివగాన రామారావు, ప్రకాష్‌నగర్ కాలనీ, కోటబొమ్మాళి



యోగా శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులు

యోగా తరగతులు..

ఆస్పత్రికి వచ్చే రోగులతోపాటు కోటబొమ్మాళి మండలంలోని పలు పాఠశాలల్లో యోగా తరగతులను ఆస్పత్రి సిబ్బంది నిర్వహిస్తున్నారు. కోటబొమ్మాళి బాలికల హైస్కూల్, చీపుర్లపాడు, తర్లిపేట పాఠశాలల్లో విద్యార్థులకు ఆస్పత్రి టీచర్ లక్ష్మీనారాయణ యోగా శిక్షణ ఇస్తున్నాడు. 300 మంది విద్యార్థులు మానసిక ప్రశాంతత, ఆరోగ్యంగా ఉండేందుకు యోగా నేర్చుకుంటున్నారు. ఆస్పత్రి లో గౌతమి టీచర్ రోగులతో అవసరమైన యోగా చేయిస్తుంటారు.

జగనన్నే శాశ్వత ముఖ్యమంత్రి కావాలి

- అందుకు గృహసారథులు కంకణం కట్టుకోవాలి
- మంత్రి డాక్టరు సీదిరి అప్పలరాజు



మాట్లాడుతున్న మంత్రి సీదిరి అప్పలరాజు

పలాస: రాష్ట్రానికి శాశ్వత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే కావాలని.. అందుకు గృహసారథులు కంకణం కట్టుకోవాలని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. పలాసలోని మంత్రి క్యాంపు కార్యాలయం ప్రగతిభవన్ ఆవరణలో పలాస మండలంలోని బూత్ కన్వీనర్లు, గృహసారథులకు గురువారం శిక్షణ కార్యక్రమం జరిగింది. వైస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైల చిట్టిబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బూత్ కన్వీనర్లకు, గృహసారథులకు మంత్రి దిశానిర్దేశం చేశారు. వారి విధులు, బాధ్యతలు వివరించారు. ప్రభుత్వం ఎంతో ముందు చూపుతో గృహసారథులను నియమించిందన్నారు. మార్చి ఒకటో తేదీన గృహసారథుల ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి పింఛన్లను అందజేసి లబ్ధిదారులను పరిచయం చేసుకోవాలన్నారు. ఇందుకు గ్రామ వలంటీర్లు సహకరించాలన్నారు. మార్చి 18 నుంచి 24వ తేదీ వరకు మా నమ్మకం నువ్వే జగన్ కిట్లను ఇంటింటికీ వెళ్లి అందజేయాలని చెప్పారు. రాష్ట్రంలో కోటి 62 లక్షల కుటుంబాలు ఉన్నాయని, వారందరికీ కిట్లను అందజేయడానికి 5.5 లక్షల మంది గృహసారథులను పార్టీ నియమించిందని చెప్పారు. ప్రతి ఇంటికి వెళ్లి కిట్‌లో ఉన్న ఐదు అంశాలను వివరించి, చివరిలో ప్రజామద్దతు పుస్తకం ఉన్న ఐదు ప్రశ్నలకు సమాధానాలు తీసుకోవడంతోపాటు ఫోన్ నంబర్‌ను సేకరించాలన్నారు. ప్రభుత్వ పాలనపై వారి అభిప్రాయాలను తెలుసుకున్న తర్వాత వారికి స్టిక్కర్ ఇచ్చి వారి చేత ఆశీర్వాదం తీసుకోవాలని.. అందుకోసం విసుగు, విరామం లేకుండా చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు. బూత్ కన్వీనర్లపై కూడా బృహత్తర బాధ్యత ఉందన్నారు. ఓటరు నాడిని పట్టుకొని పార్టీకి ఎప్పటికప్పుడు తెలియజేయాలని అందుకు ఏమి చేయాలో తగిన సూచనలు మంత్రి చేశారు. ఏ రంగంలో ఉంటే ఆ రంగంలో కృషి చేస్తే తప్పకుండా విజయం వరిస్తోందన్నారు. అందుకు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు, మండల కమిటీ నాయకులు, క్లస్టర్ కోఆర్డినేటర్లు సమిష్టిగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ పలాస నియోజకవర్గ పరిశీలకులు సూర్యనారాయణరాజ్, సీనియర్ నాయకులు హనుమంతు వెంకటరావు, ఎంపీపీ ఉంగ ప్రవీణ, జెడ్పీటీసీ సభ్యుడు మచ్చ రత్నాలు, వ్యవసాయ సలహా మండలి కమిటీ అధ్యక్షుడు గొర్లె వేణుగోపాల్, యువ సేన మండల అధ్యక్షుడు ఎం.ఎస్.మూర్తి, ఏఎంసీ వైస్ చైర్మన్ జి.లోకేశ్వరి, దువ్వాడ రవి, కొర్ల సంతోష్, సవర దాలమ్మ, కొల్లి నారాయణరావు, జి.మోహనరావు, పలాస కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, ఉంగ సాయికృష్ణ, చింతాడ మాధవరావు పాల్గొన్నారు.



పాల్గొన్న గృహ సారథులు, బూత్ కమిటీ కన్వీనర్లు

యాజమాన్య పద్ధతులే కీలకం

- కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ భాగ్యలక్ష్మి



ఫీల్డ్‌డే కార్యక్రమంలో అధికారులు, శాస్త్రవేత్తలు

పోలాకి: వ్యవసాయం లాభసాటిగా ఉండాలంటే యాజమాన్య పద్ధతులే కీలకమని ఆమదాలవలస కృషి విజ్ఞానకేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ భాగ్యలక్ష్మి అన్నారు. కుసుమపోలవలస గ్రామంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో 'వేరుశనగ పంటలో సమగ్రసాగు–యాజమాన్య పద్ధతులు'అనే అంశంపై గురువారం ఫీల్డ్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో పలువురు వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు పాల్గొన్నారు. నేల స్వభావం, విత్తనం ఎంపిక, ఎరువుల యాజమాన్యం, నీటి తడుల అందుబాటు, సస్యరక్షణ చర్యలు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతోందన్నారు. ఏడీఏ రవీంద్రభారతి మాట్లాడుతూ.. ఈ ఏడాది వేరుశనగ ఆశాజనకంగా ఉందన్నారు. చాలామంది రైతులు రైతుభరోసా కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను వినియోగించుకున్నారని చెప్పారు. ఏవో చిరంజీవి మాట్లాడుతూ.. జిప్సం వాడకం ద్వారా దిగుబడులు పెంచుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ శాస్త్రవేత్త నీలవేణితో పాటు రైతులు, వీఏఏలు పాల్గొన్నారు.

విద్యార్థినులకు డీఈవో పరామర్శ



విద్యార్థినితో మాట్లాడుతున్న పగడాలమ్మ

కాశీబుగ్గ: అస్వస్థతకు గురైన పలాసలోని మహాత్మా జ్యోతిబా పూలే రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థినులను డీఈవో గార పగడాలమ్మ గురువారం పరామర్శించారు. పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతున్న పిల్లల వద్దకు వైద్య బృందంతో కలిసి వెళ్లి మాట్లాడారు. ఏడుగురు విద్యార్థినులు అస్వస్థతకు గురికావడానికి కారణాలపై ఆరా తీశారు. ఫుడ్ పాయిజన్ జరిగిందా, ఇతర సమస్య ఏదైనా ఉందా అని అగిడి తెలుసుకున్నారు. అనంతరం రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనం రుచిచూశారు. ఆ తరువాత కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్షలపై చర్చ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ మేఘన, మండల విద్యాశాఖాధికారి శ్రీనివాసరావు, సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీరు భవానీశంకర్ పాల్గొన్నారు.

విద్యార్థినుల అస్వస్థతపై విచారణ

కాశీబుగ్గ: మహాత్మాజ్యోతి బాపూలే బాలికల వసతి గృహానికి చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థినులు అస్వస్థతకు గురైన ఘటనపై విద్యాసంస్థల జిల్లా కన్వీనర్ జె.లక్ష్మణమూర్తి గురువారం విచారణ చేపట్టారు. పిల్లలు చికిత్స పొందుతున్న పలాస సామాజిక ఆస్పత్రికి వెళ్లి విద్యార్థినులతో మాట్లాడారు. వారు తిన్న ఆహారంపై ఆరా తీశారు. బుధవారం మధ్యాహ్నం చికెన్, రాత్రి క్యాబేజి పువ్వు కూర తిన్నట్లు విద్యార్థినులు వివరించారు. బయట నుంచి తీసుకొచ్చిన తినుబండారాలు ఏమైన తిన్నారా అని అడిగి తెలుసుకున్నారు. వసతిగృహం పరిసరాలను పరిశీలించారు. హాస్టల్ సమీపంలోని మురుగు కాలువ నుంచి దుర్వాసన వెదజల్లడం, హాస్టల్ సమీపంలో చెత్త వేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మురుగు కాలువ విషయాన్ని మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సిబ్బందికి సూచించారు. పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం ముడిపడి ఉంటుందన్నారు. ఇద్దరు సభ్యులతో కూడిన కమిటీ వేసినట్టు చెప్పారు. సామాజిక ఆస్పత్రి అందించే విద్యార్థినుల ఆరోగ్య రిపోర్ట్‌ను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు చెప్పారు. అక్కుపల్లి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.పాపారావు, స్థానిక ప్రిన్సిపాల్ విద్యాధర్ ఉన్నారు.



విచారణ చేస్తున్న లక్ష్మణమూర్తి

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

శ్రీకాకుళం క్రైమ్: శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని డైమండ్ పార్క్ దరి రహదారి వద్ద గత నెల 18న పడిపోయిన పెద్దపాడుకు చెందిన బొట్ట కృష్ణ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సీఐ పి.శ్రీనివాసరావు తెలిపారు. కృష్ణకు మూర్చ వ్యాధితోపాటు మద్యం అలవాటు ఉంది. ఈ క్రమంలోనే రోడ్డుపై పడిపోవడంతో తలకు గాయమైంది. బంధువులు అతన్ని రిమ్స్‌కు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ కృష్ణ మృతి చెందినట్టు సీఐ చెప్పారు. మృతుని కుమారుడు కిరణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

వ్యక్తి బలవన్మరణం



దేవదాసు మృతదేహం వద్ద విచారణ చేస్తున్న పోలీసులు

కంచిలి: వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన పెద్దశ్రీరాంపురం గ్రామంలో బుధవారం రాత్రి చోటుచేసుకోగా.. తాండ్ర దేవదాసు అలియాస్ పొట్టయ్య (45) తనకు చెందిన తోటలోని చెట్టుకు ఉరిపోసుకొని ప్రాణాలు తీసుకున్నాడు. పోలీసులు గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. దేవదాసు కుటుంబ సభ్యుల మధ్య 15 ఏళ్లుగా 22 సెంట్ల భూమికి సంబంధించి వివాదం నడుస్తోంది. ఈ విషయమై గ్రామంలో బుధవారం పెద్దల సమక్షంలో పంచాయితీ జరిగింది. ఇందులో చెప్పిన పరిష్కారం వలన తనకు అధికంగా ఆర్థిక నష్టం సంభవిస్తుందని భావించి దేవదాసు కలత చెందాడు. బహిర్భూమికని చెప్పి బయటకు వెళ్లిన ఆయన తిరిగి ఇంటికి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు గాలించగా.. మామిడి చెట్టుకు ఉరిపోసుకొని చనిపోయి ఉండటాన్ని గుర్తించారు. మృతుని భార్య చంద్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నటుట కంచిలి ఎస్‌ఐ ఎస్.చిరంజీవి గురువారం తెలిపారు.

13న శిష్టకరణ సంఘం చలో ఢిల్లీ



మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శిష్టకరణాలను ఓబీసీలో చేర్చేలా కృషి చేస్తున్నామని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోలుమహంతి ఉమామహేశ్వరరావు చెప్పారు. ఇందులో భాగంగా మార్చి 13వ తేదీన చలో ఢిల్లీ కార్యక్రమానికి పిలుపునిచ్చినట్టు చెప్పారు. శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా, విద్యాపరంగా వెనుకబడిన శిష్ట కరణాలను కేంద్రం వోబీసీల జాబితాలో చేర్పించాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు. తమ డిమాండ్‌ను కేంద్ర మంత్రులకు, ఎంపీలకు, జాతీయ బీసీ కమిషన్ చైర్మన్‌కు విన్నవిస్తామన్నారు. అంతేకాకుండా జంతర్ మంతర్ వద్ద మౌన దీక్ష చేపట్టడానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించనున్నామన్నారు. ఈ కార్యక్రమం సంఘ జాతీయ అధ్యక్షుడు డి.వి.కృష్ణారావు, ఎ.వి.ఎస్.ఎస్. నాగార్జున, కోశాధికారి గుమ్మ ఉమా శంకర్‌ల నేతృత్వంలో జరగనుందని వివరించారు. సమావేశంలో జాతీయ కార్యదర్శి, ప్రముఖ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ శ్రీనివాస్ పట్నాయక్, జిల్లా అధ్యక్షులు బలివాడ మల్లేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి డబ్బీరు శ్రీనివాసరావు, కోశాధికారి ఉరిటి కిరణ్‌బాబు, పెదపెంకి శ్రీరామ్‌కుమార్, విజయ్, నారాయణరావు, బి.రామచంద్రరావు, డాక్టర్ ఎ.కనకరాజు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉపాధి వేతనదారు మృతి



తిరుమరెడ్డి కమల (ఫైల్)

మందస: చికిత్స పొందుతూ ఉపాధి హామీ పథకం వేతనదారు మృతి చెందింది. వివరాల్లోకి వెళ్లితే.. హరిపురం గ్రామానికి చెందిన తిరుమరెడ్డి కమల (59) హరిపురంలోని కోవెల చెరువు అభివృద్ధి పనులకు హాజరవుతుండేవారు. ఈ నెల పదో తేదీన చెరువులోని పిచ్చిమొక్కలు కాల్చుతున్న సమయంలో అటువైపు వెళ్లిన కమలకు మంటలు వ్యాపించాయి. గాయపడిన ఆమెను తొలుత హరిపురంలోని సామాజిక ఆరోగ్యకేంద్రంలో చేర్పించి చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం టెక్కలి ప్రభుత్వ ఆస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడి నుంచి శ్రీకాకుళంలోని రిమ్స్, ఆ తరువాత విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మరణించింది. మృతురాలి కుటుంబాన్ని ఎంపీడీఓ, ప్రోగ్రాం అధికారి వాయలపల్లి తిరుమలరావు, ఏపీవో బి.వి.హరికృష్ణ, ఈసీ చింతా సురేష్ వర్మ, టీఏలు మాధురి, వాసుదేవు, కృష్ణారావు, భారతి, దాలయ్య, చింతామణి, పుష్పలత పరామర్శించి సంతాపం తెలియజేశారు. కమల మృతిపై మందస హెడ్ కానిస్టేబుల్ రవీంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని ఎస్‌ఐ వై.రవికుమార్ చెప్పారు.

శతాధిక వృద్ధుడు మృతి



పెద్దశ్రీరామూర్తి (ఫైల్)

హిరమండలం: భగిరధిపురం అగ్రహారానికి చెందిన శతాధిక వృద్ధుడు కొల్లూరు పెద్ద శ్రీరామూర్తి (107) గురువారం మృతి చెందారు. కొన్ని రోజులుగా వయోభారంతో బాధపడుతున్న ఈయన ఇంటి వద్దనే కన్నుమూశారు. 1916లో పేద బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన శ్రీరామూర్తి వేద విద్యను అభ్యసించారు. ప్రాథమిక స్థాయి నుంచే అవధానం, చతుర్వేదాల్లో పట్టు సాధించారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడుగా విధులు నిర్వహించారు. ఉద్యోగ విరమణ అనంతరం వేద విద్య శిక్షణను ప్రారంభించారు. అవదానంలో దిట్ట. తెలుగు భాష అంటే ఎనలేని అభిమానం. తెలుగు భాషకు వన్నె తగ్గడంపై తరచూ తన ఆవేదన వ్యక్తం చేసేవారు. ఈయనకు 50 మందికి పైగా మునుమనవలు ఉన్నారు.

విద్యార్థుల్లో చదివే శక్తిని పెంచాలి

- ఎల్‌ఐపీ రాష్ట్ర పరిశీలకుడు వెంకటరెడ్డి



కేజీబీవీలో విద్యా సామర్థ్యాలను పరిశీలిస్తున్న వెంకటరెడ్డి

సారవకోట: విద్యార్థుల్లో చదవ గలిగే శక్తి పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం రాష్ట్ర పరిశీలకులు వై.వెంకటరెడ్డి సూచించారు. బుడితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సారవకోటలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో అమలవుతున్న ఎల్‌ఐపీ కార్యక్రమాన్ని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండేళ్ల కరోనా సమయంలో విద్యార్థులు పాఠశాలలకు హాజరు కాకపోవడంతో చదివే శక్తి తగ్గిందన్నారు. చదువుపై ఆసక్తి చూపేలా ఆరు నుంచి ఎనిమిదో తరగతి విద్యార్థులకు లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో మూడు రోజుల పాటు ఈ కార్యక్రమం అమలు తీరును పరిశీలించనున్నట్టు పేర్కొన్నారు. తాను పరిశీలించిన పాఠశాలల్లో ఉపాధ్యాయులు పాఠాలను బోధిస్తునప్పటికీ దానిని పిల్లలు అభ్యాసనం చేయడంలో లోపం ఉన్నట్లు గుర్తించామన్నారు. ఆ లోపాలను సరిచేసుకుని విద్యార్థుల్లో అభ్యసనా సామార్థ్యం పెంపొందించేందుకు కృషి చేయాలని సూచించారు. ఎంఈవో ఎం.వి.రమణ, కేజీబీవీ ఎస్‌వో శిరీష ఉన్నారు.

భువికకు నటరాజ పురస్కారం ప్రదానం



పురస్కారం అందుకుంటున్న భువిక

పోలాకి: గొల్లవలస గ్రామానికి చెందిన ఆరో తరగతి విద్యార్థిని నీలంరాజు భువికకు నటరాజ జాతీయ పురస్కారం వరించింది. ఈనెల 12న తమిళనాడులోని రామేశ్వరం శ్రీనటరాజ టెంపుల్‌లో నేషనల్ క్లాసికల్ డాన్స్ అకాడమీ వారిచే నిర్వహించిన ఆలిండియా క్లాసికల్ డాన్స్ ఫెస్టివల్‌లో భువికకు పురస్కారాన్ని ప్రదానం చేశారు. భువికకు నృత్యమంటే ఇష్టం. దీంతో తల్లిదండ్రులు విజయవాడలోని ప్రముఖ నృత్యకళాకారుడు అజయ్‌కుమార్ వద్ద క్లాసికల్ డాన్స్ నేర్పించారు. ఇప్పుడు జాతీయ పురస్కారం అందుకోవటంపై తల్లిదండ్రులు శరత్ కుమార్, క్రిష్ణకుమారిలు ఆనందం వ్యక్తం చేశారు.